ఆయన ఆఫీస్‌కీ, పిల్లలు స్కూల్‌కీ వెళ్లిపోయారు. జడ విప్పుకుని తిరిగ్గా డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూచున్నాను.

మనసంతా ఆయన చుట్టూనే తిరుగుతోంది.

రోజురోజుకీ ముభావంగా మారిపోతున్న ఆయన వైఖరిని ఎలా అర్థం చేసుకోవాలో తెలియటం లేదు.

పెళ్లైన కొత్తల్లో-

'కొంత మంది మగాళ్ళు... పెళ్ళై ఎన్ని సంవత్సరాలైనా... భార్యతో మాట్లాడేందుకు సిగ్గు పడిపోతారు... ఆఖరికి భార్య దగ్గర కూడా...!'

ఈ వాక్యాలు ఎక్కడో చదివింది. తన భర్త కూడా ఆ కోవకు చెందినవాడేనేమో! అనుకునేందుకు వీలు లేదు.

అతని ప్రవర్తన చూసి మొదట్లో బాధ పడేదాన్ని. నాదగ్గర కూడా ముఖమాటపడుతున్నాడేమో అని సందేహపడేదాన్ని. తను ఇద్దరు పిల్లల తల్లి అయింది. అయినా-

అతని తత్వంలో, తనలో మార్పు రాలేదు.

ఇరుగు, పొరుగులో నావట్ల అభిమానం వుంది. కొంత మందిని ఆకట్టుకోగలిగాను కూడా. అయితే ఆయనని మాత్రం మెప్పించలేకపోతున్నాను.


నా ఆలోచనలు నాకే చిత్రంగా వుంటాయి. రాత్రిళ్ళు పడగ్గదిలోనైనా సరదాగా వుంటారేమో! అని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూసేది. కానీ... అతనిలో ఎలాంటి చలనం ఉండేది కాదు. ఏదో 'ఇష్టం లేని కూర తింటున్నట్లు'గా ఎలాంటి స్పందనా లేకుండా యాంత్రికంగా తనని దగ్గరకు తీసేవాడు.

భర్తనోటి నుండీ... తను పెళ్ళైన ఈ ఐదు సంవత్సరాలలో, భర్త మనస్సు గెలుచుకుని,

"లక్ష్మీ! నా అణు వణువులో నీవే నిండిపోయావ్. నిన్ను భార్యగా పొందిన నేను ఎంత అదృష్టవంతుడ్ని. ఎన్ని జన్మలైనా నువ్వే నా భార్యవి కావాలి." అని తనవంక ప్రేమగా చూస్తూ భర్త మురిసిపోవాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది.

ఫలితం... శూన్యం.

ఎందుకో! రోజు రోజుకీ అతణ్నే ఏవేవో చిలిపి పనులు చేయాలనిపిస్తోంది. తను కోరకుండానే రకరకాల చీరలు, నగలు, తన ముందు తెచ్చిపడేస్తాడు. తనప్రేమ పట్ల లేక అతనిదగ్గరకు చేరుకుందాం అనుకుంటే ఏదో 'భయంకరమైన మృగాన్ని చూసినట్లు' తనకి అందకుండా ఆమడ దూరం పరిగెత్తుతాడు. ఇలాంటి మనిషిని ఎలా అర్థం చేసుకోవాలి.



# అమాయకుడు

ఎస్. ఉదయారావు

## అమాయకుడు

ఎందుకంటే తమ ఇంటికి వచ్చే ఆడ కొలీగ్స్‌తో గలగలా నవ్వేస్తూ, ఎంతో సరదాగా, కలుపుగోలుగా మాట్లాడే భర్త తనతో అలా ఎందుకు ఉండడో?- ఈ మిష్టరీ ఏమిటో? తనకి అర్థం కాదు.

'నీలో ఈ లోపం వుంది. అందుకే నీతో నేను సరిగ్గా ఉండలేకపోతున్నాను.' అని అతను తన ముఖం మీద చెప్పినా బాధ పడదు. సరికదా... చక్కదిద్దుకునేందుకు ప్రయత్నిస్తుంది.

అప్పటికీ, ఎన్నోసార్లు అతన్ని సాధించింది. ఏడ్చింది. అతన్ని నిలదీసింది. 'ఎందుకూ... ఎప్పుడూ... అలా... మూడీగా' వుంటారూ? నాతో ఓ నాలుగు ముక్కలు మాట్లాడితే మీ సొమ్మేంపోతుందీ అని.

తాను ఎన్ని మాట్లాడినా ఉలుకూ, పలుకూ వుండవు. 'నిమ్మకు నీరెత్తినట్లుగా' వుండే భర్తని చూస్తుంటే-!

ఒక్కొక్కసారి జీవితమంటే విరక్తి పుడుతుంది.

కానీ... తన కాళ్ళకి బంధాలు పిల్లలు. ఒకవేళ తను చచ్చిపోవాలనుకున్నా తన ఆత్మ భర్త, పిల్లలు చుట్టూనే తిరుగుతుందేమో! ఏమిటో? పిచ్చి ఆలోచన!

పెళ్ళికాక ముందు ఎన్నెన్నో కలలు కంది తను. భార్యా, భర్తలిద్దరూ... ఒకరి పక్క ఒకరు కూర్చుని, మనస్సు విప్పి మాట్లాడుకుంటూ, హాయిగా మనసారా నవ్వుకుంటూ, ఒకరి ఒడిలో ఒకరు ఒదిగిపోతూ... ఎన్నెన్నో మధుర స్మృతులు నిలుపుకోవాలని ఉవ్విళ్ళూరేది.

కానీ ఏం జరిగింది? కలలన్నీ కల్లలుగానే మిగిలిపోయాయ్. భర్త మనస్సు దోచుకోలేని ఒక అతి సామాన్యమైన ఆడదానిలా మిగిలిపోయి జీవితాన్ని నిస్సారంగా గడిపి వేస్తోంది.

గతం తలుచుకుంటే- గుండెల్లో ఏదో ఆర్పరాని మంట. మనసంతా... రేగిన పుండులా బాధగా వుంది.

అదే పనిగా మ్రోగుతున్న కాలింగ్ బెల్ కి ఉలిక్కిపడి, ఆలోచనలు పక్కకు నెట్టి, తలుపు తెరిచాను.

ఎదురుగా- ఆయనే!

"ఏం ఆఫీస్ లేదా?" అడిగాను ఆ టైమ్‌లో వచ్చిన ఆయన వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఉంది."

"మరి! ఇలా వచ్చారేమిటి?"

ఆయనసంగతి నాకు బాగా తెలుసు. నేను అడిగిన వాటికి జవాబు చెబుతారుకానీ, ఆ పైన ఒక్క ముక్క మాట్లాడరు. ఆఫీస్ పని మీద అర్జంటుగా మద్రాసు వెళ్ళాలి. బెడ్‌రూమ్‌లోకి నడుస్తూ అన్నారు.

ఆయన వెనుకే నేను-

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" దిగులుగా అడిగాను. ఆయన నాతో మాట్లాడినా, మాట్లాడకపోయినా కనీసం నా ఎదురుగా ఉంటే చాలనుకుంటాను.

"నాలుగు రోజులు పట్టవచ్చు." హడావిడిగా సూట్ కేస్‌లో బట్టలు సర్దుకున్నారు. వెళ్తున్నాననైనా చెప్పకుండా ఆయన వెళ్ళిపోయారు.

ఆయనవంక గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయాను. చాలాసేపయింది. నెమ్మదిగా గదిలోకి వచ్చి మంచం మీద పడ్డాను. పిచ్చి పిచ్చి ఆలోచనలు....

గదినంతా కలయచూశాను. అసహ్యంగా వుంది. ఎక్కడ పడితే అక్కడ వేళ్ళాడుతున్న బట్టలతో, పిల్లలు ఆడి పారేసిన ఆట వస్తువులతో.... "ఏం పిల్లలో! ఏ వస్తువూ సర్దిన చోట వుంచరు కదా! ఏ రోజు కారోజు ఆ బల్లమీదున్న పుస్తకాలు, బీరువాలో వున్న బట్టలు... సర్దుదాం అనుకుంటూనే బద్ధకించేస్తున్నాను..." నాకు నేనే చెప్పుకుని చిరాకు పడ్డాను.

ఆయన వచ్చేటప్పటికి ఇల్లంతా నీట్‌గా సర్ది... "చూశారా! మన బెడ్‌రూమ్ ఎంత అందంగా మార్చేశానో! దీనికి బహుమతిగా నాకేమిస్తారు?" అని....

ఆయన్ని కవ్విస్తున్నట్లుగా ఏవేవో కలలు కనేస్తూ... బల్ల మీదున్న పుస్తకాలన్నీ ఒక దాని పక్క, ఒకటి పేర్చాను. డ్రాయర్ సొరుగులాగి, అందులో వున్న కాగితాలన్నీ బొత్తిగా పేరుస్తుంటే అడుగున ఒక నల్ల డైరీ-

కుతూహలంగా దానిని బయటకి తీస్తుంటే ఎన్నెన్నో సందేహాలు. ఈయన డైరీ కూడా రాస్తారా? తను డైరీ రాయటం నేనెప్పుడూ గమనించలేదే? స్వగతంగా అనుకొంటూ ఉత్సాహంగా పేజీలు తిప్పబోయాను.

"డైరీ అక్కడ పెట్టెయ్." మనస్సు గద్దించింది.

"ఛత్... నోర్ముయ్. ఏం తప్పు లేదు. భార్యా, భర్తల మధ్య దాపరికాలేమిటి?" మనసుని కసిరి కొట్టేశాను.

గబ గబా పేజీలు తిప్పసాగాను. చాలా పేజీలు ఖాళీగా వున్నాయ్. కొన్ని పేజీల్లో ఏవేవో లెక్కలు, ఆఫీస్ విషయాలూ రాసి వున్నాయి.

ఆ పేజీలో-

ముత్యాల్లా అక్షరాలు. నా చూపులు ఉత్సుకతతో ఆ అక్షరాల్ని చూడసాగినై.

గుండెలు చిక్కబట్టుకుని కూర్చున్నాను.

మేధస్సు చదువుకుంటోంది.

కళ్ళు పరిభ్రమిస్తున్నాయ్.

"................"

డైరీని మూసి పక్కన పెట్టాను.

అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్లు తిరిగినై.

కొంగుతో కళ్ళు తుడుచుకుని, పక్కమీద వాలిపోయాను.

మనస్సు డైరీలోని రాతనే మననం చేసుకోసాగింది.

'ఎందుకో! నేను పెరిగిన వాతావరణమో! నేను చూసిన సంఘటనల ఫలితమో! తెలియదు. అవి నాతోపాటు పెరుగుతూ వచ్చాయ్.

భార్య పట్ల వల్లమాలిన ప్రేమనీ, ఆప్యాయతనీ, అనురాగాన్నీ బహిర్గతం చేస్తూ, ఆమె కొంగు పట్టుకు తిరగుతుంటే, ఆమె అతన్నిచులకన చేసి, అతని నెత్తి నెక్కి తన ఇష్టం వచ్చినట్లు స్వారీ చేస్తూ... అందరి ముందూ... అతన్ని హీనంగా చూస్తూ... అవును.

'భార్యకి చనువివ్వనంత వరకే మగాడి గొప్పతనం.' లేకపోతే 'సూదిలా వచ్చి దబ్బనం'లా మారిపోతుందనే సత్యం చాలా సంసారాల్లో చూశాను.

అందుకనే ఆ పరిస్థితిని రానీయను. నా లక్ష్మి అలా కాకూడదు. ఆమెకు అసలా అవకాశమే ఇవ్వను.

ఆమె ప్రేమ వెల్లువలో పడి నేను కొట్టుకుపోకూడదు. నాకు నేనుగా బలమైన సంకెళ్లు వేసుకోక తప్పదు. తానంటే నేనెంత మురిసిపోతానే, తానంటే నాకెంత అనురాగమో ఆమెకు తెలియనీయకూడదు.'

ఎన్ని- సందేహాలు?- ఎన్నెన్ని భయాలు?

ఒక నిశ్చయానికి వచ్చాను. రేపటి నుంచీ నా ప్రవర్తనే ఆయనలో మార్పుని తీసుకు వస్తుంది. మనసుంటే, అందునా అవతలి వ్యక్తిని తెలిసిన మనసుంటే-

సన్నగా నవ్వుకున్నాను.

అప్పుడే తొలకరి జల్లు ప్రారంభమైంది!

### అల

అహరహం
ఆకలి పొట్ల వేట్లతో
అలమటిస్తూ... ఆహారం కోసం
వెదుకుతోన్న బెస్తవాని తెప్పను
బలగర్వంతో తెగముంచుతుంటావు!
ఒడ్డుకు రాగానే నీ పడ్డే
విరుగుతుందని నీవు
తెలుసుకోలేవు!!

-వి. జయరామిరెడ్డి